# ఉషోదయం

-కోపూరి పుష్పాదేవి

"నాకో సాయం చేసి పెట్టాలోయ్..." అన్నారు డి.ఇ. ప్రభాకర్ జె.ఇ. ఆదిత్యతో. తనపై అధికారి సాయం చెయ్యమని అడుగుతుంటే ఆశ్చర్యపోతూనే "ఏమిటండీ అది..." అన్నాడు ఆదిత్య.

"నాకు ఒక కజిన్ సిస్టరుందోయ్. డిగ్రీ చేసింది. ఇంకా పైకి చదవమంటే చదవనంటున్నది. ఏదైనా ఉద్యోగం చూడమంటున్నది. ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం అంత సులభమా చెప్పు... తనకి చిన్న పిల్లలంటే మహా ఇష్టం. గవర్నెస్‌గా చేస్తానంటున్నది. ఎవరికైనా కావాలేమో చెప్పు..." అన్నారు ప్రభాకర్.

ఆ మాట వినగానే తన ఇంటి పరిస్థితి గుర్తు వచ్చింది ఆదిత్యకు. ఇద్దరు చిన్న పిల్లలతో వేగలేక, తన తల్లి పడే అవస్థ కళ్ళకు కట్టింది. మూడేళ్ళ సుమంత్, నాలుగు నెలల పాపాయి. సుమంత్ ఒట్టి అల్లరివాడు. వాణ్ణి పట్టుకోవడం మహా కష్టం. చంటి పాప, తల్లిపాలు లేకపోవడంతో, అనారోగ్యంగా ఉండి ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటుంది. తల్లి లేని ఆ పసి వాళ్ళను చూడటానికి ఎవరినైనా ఏర్పాటు చేయాలని తనే ఆలోచిస్తున్నంతలో, తన మనసులో మాట గ్రహించినట్లు ప్రభాకర్‌గారు అడిగే సరికి, ఎక్కడో ఎందుకు సార్, మా పిల్లలకే కావాలి. నేనే ఎవరినన్నా ఏర్పాటు చేద్దామనుకుంటున్నాను. మీరే అడిగారు. తెలిసిన వాళ్ళయితే మరీ మంచిది. మీకు మెనీ మెనీ థ్యాంక్స్..." అన్నాడు సంతోషంగా ఆదిత్య.

○ ○ ○

ఉష పిల్లలకు గవర్నెస్‌గా రావడంతో ఆదిత్య తల్లి కమలమ్మ గారికి ఊపిరి సలిపినట్లయింది. ఆదిత్య భార్య వారిజకు మొదటి కాన్పు సులభంగా జరిగింది. రెండవసారి మాత్రం గర్భం వచ్చినప్పటి నుండీ కాంప్లికేషన్స్ మొదలయ్యాయి. హై బీపీ రావడం, ఒంటికి నీరు పట్టడం వంటి సమస్యలెన్నో చుట్టుకున్నాయి. ఎన్ని మందులు వాడి, ఎంతగా జాగ్రత్తలు తీసుకున్నా, డెలివరీ అవగానే ప్రాణాలు వదిలింది ఆమె. వారిజ ఎంతో మంచి అమ్మాయి. అందరూ ఆమెను కమలమ్మ గారి కూతురు అనుకునేవారు. వారిజ పోయిన దుఃఖం కమలమ్మ గారి మనసును ముక్కలు చేస్తున్నా, పిల్లల బాధ్యత తీసుకోవడం తప్పలేదు. ఆమెకి అసలే పెద్ద వయసు. మనసుకి తగిలిన గాయంతో పాటు, పిల్లల పని తప్పకపోయే సరికి, ఆమె పని అయిపోయింది. రేపో మాపో మంచంలో పడేటట్లు ఉన్నది పరిస్థితి.

ఉష కూడా మంచితనంతో పాటు చాలా చురుకయిన అమ్మాయి. పేరుకి పిల్లల గవర్నెస్ అయినా, పిల్లల్ని చక్కగా చూసుకోవడంతో పాటు వంటపని, ఇంటిపని, తోటపని అంటూ ఒకటేమిటి... అన్ని పనుల్లోనూ కమలమ్మ గారికి ఎంతో సాయం చేస్తోంది. చాలా తెలివిగలది కూడా. "అసలు తనకు తెలియని విషయమే లేదా...?" అనిపిస్తుంది కమలమ్మ గారికి ఉష మాటలు వింటుంటే.

"ఇంత తెలివిగల అమ్మాయి, ఇంకా చదవకుండా ఎందుకు ఆపేసినట్లు...?" అని సందేహం వెలిబుచ్చారు వెంకట్రామయ్య. ఆయన ఆదిత్య తండ్రి.

ఇంకా చదవాలని నాకు ఇంట్రెస్టు లేదండీ. ఎంతో కొంత సంపాదించి, నాన్నకు సాయపడదామని ఈ ఉద్యోగానికి వచ్చాను..." అన్నది ఉష.

అటువంటి కూతురు తమకు ఉంటే బాగుండునని ప్రతి తల్లీ, తండ్రీ ఆశపడతారు. ఆమె తన స్నేహితురాలయితే అదృష్టం అని తోటివాళ్ళు భావిస్తారు. ఒక భర్త ఖచ్చితంగా అటువంటి భార్యనే కోరుకుంటాడు.

○ ○ ○

ఏడాది గడిచింది. పిల్లలు ఒక దారిలోకి వచ్చారు. సుమంత్ బుద్ధిగా కాన్వెంట్‌కు వెళ్తున్నాడు. పసిపిల్ల సుస్మిత కూడా, చక్కగా ఒళ్ళుచేసి, ఆరోగ్యంగా, బొద్దుగా, ముద్దుగా ఉంది. ఉష తోడ్పాటుతో కమలమ్మ, వెంకట్రామయ్యల ఆరోగ్యం కూడా బాగుపడింది.

○ ○ ○

అంతా బాగానే ఉన్నది కానీ, ఆదిత్య పరిస్థితే

---

**విద్య-వైద్యం**

చదువు / కొనలేని వారికి / గగన కుసుమం
వైద్యం / కలవారికే / నైవేద్యం

-పొనుగోటి నరసింహారావు

---

ఉషకు బాధాకరంగా ఉన్నది. ఏ చిన్న బాధకయినా, ఆడవాళ్ళు బయటపడిపోయి, కన్నీళ్ళు కార్చి, తమ బరువు దింపుకుంటారు. మగవారి పరిస్థితి అలా కాదు. ఎంత ఆవేదననయినా, మనసులోనే దాచుకుంటారు.

తను బాధపడితే, తల్లిదండ్రులు మరీ దిగులు పడతారని, ఆదిత్య తన వ్యధను గుండెల్లోనే దాచుకుంటాడు. లేని సంతోషాన్ని నటిస్తాడు. ఆ సంగతి ఉషకు తెలుసు.

తన తప్పిదానికి, ఆ పసిపిల్లలు తల్లిని కోల్పోయారనీ, ఆ కుటుంబం కష్టాల కడలిలో మునుగుతోందనీ, అలవికాని బాధతో ఆదిత్య అంతరంగంలో నలిగిపోతున్నాడనీ ఉషకు తెలుసు. చేసిన తప్పుకు పశ్చాత్తాప పడినా, జరిగిన పొరపాటు దిద్దుకోవడం కుదరదని కూడా ఆమెకు తెలుసు. అన్నీ తెలిసీ, ఆమె కూడా అహర్నిశలూ తనలో తాను కుమిలిపోతూ ఉంటుంది.

ఇంట్లో, అన్ని పనులతో పాటు, ఉష ఆదిత్య గది కూడా సర్దుతూ ఉంటుంది. గుమ్మానికి ఎదురుగా, ఆదిత్య, వారిజల బ్రెస్ట్‌సైజ్ ఫోటో ఉన్నది ఆ గదిలో. అది లామినేషన్ చేయబడి, ఎంతో అందంగా ఉంది. ఇద్దరూ అందమైనవారు. మేడ్ ఫర్ ఈచ్ అదర్..." అనుకున్నది ఉష. ఆమె ఆదిత్య దగ్గర కూడా చనువు సంపాదించింది.

ఆదిత్య పేరుకి తగిన ప్రతిభావంతుడు కూడా. విద్యా, వినయ సంపన్నుడు. మంచి ఇంజనీరుగా పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తున్నవాడూను. అయితే... ఈ మధ్య చైన్ స్మోకర్ అవుతున్నాడు. అప్పుడప్పుడూ మందు కూడా సేవిస్తున్నాడు. కొడుకు పరిస్థితి గమనించిన కమలమ్మ, వెంకట్రామయ్యలు అతణ్ణి మళ్ళీ పెళ్ళి చేసుకోమని ఎంతగానో చెప్పి చూశారు. అతనే మాత్రమూ ఒప్పుకోలేదు. "నిరాహార దీక్ష చేస్తానని" కమలమ్మ గారు బెదిరించినా అతను లొంగలేదు.

ఇదంతా గమనిస్తున్న ఉష, తను కూడా అతనికి చెప్పి చూసింది. "అందరూ దిగు దిగు అనే వాళ్ళే కానీ, ఒడ్డు నుండి చూసేవారికి ఏమి తెలుస్తుంది దిగిన వాడి బాధ..." అన్నాడు ఆదిత్య మరో సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

"అయితే... వచ్చే ఆమె పిల్లల్ని సరిగ్గా చూడదనా మీ సందేహం..." "అంతేగా మరీ..."

"పిల్లల్ని బాగా చూసుకుంటుందని నమ్మకం కుదిరితే, మీకు అంగీకారమేనా...?"

"అనుకోవడమే గానీ ఎవరుంటారలా...? స్వార్థంలేని రాజకీయ నాయకుడు ఉండనట్లే, సవతి పిల్లల్ని కన్న పిల్లలుగా చూసేవాళ్ళూ ఉండరు. అది అత్యాశ..."

"మరీ అంతగా తీసేయకండి. మీకు ఇష్టమయితే, నేను సిద్ధమే..." అన్నది ఉష.

"నీకేం కర్మ... రెండో పెళ్ళివాడినీ, అందులోనూ ఇద్దరు పిల్లల తండ్రినీ చేసుకోవడానికి...?"

"అది కర్మ అని నేను అనుకోను. అదృష్టంగా భావిస్తాను. మీరు ఒప్పుకుంటే..."

"ఏం వేళాకోళంగా ఉందా..., ఆడించడానికి నేనే దొరికానా నీకు జోకులు వెయ్యడానికి కూడా ఓ హద్దు ఉండాలి..." కోపంతో ముఖం ఎర్రబడగా, విసురుగా అన్నాడు ఆదిత్య.

"మిమ్మల్ని ఎగతాళి చెయ్యడం నా ఉద్దేశ్యం కాదు. మిమ్మల్ని నమ్మించడానికి నేనేం చెయ్యాలో చెప్పండి..." అన్నది ఉష అతడు నొచ్చుకున్నందుకు బాధపడుతూ.

"అసలు నువ్వీ నిర్ణయం ఎందుకు తీసుకున్నావో చెప్పు. నీకు ఇష్టమైతే సరా..., మీ అమ్మా, నాన్నా అందరూ ఒప్పుకోవద్దూ..." కొద్దిగా మెత్తబడినట్లు అన్నాడు.

"నా మాటను మా అమ్మా, నాన్నా కాదనరు. అయినా, నేను ఈ నిర్ణయం తీసుకోవడానికి వెనుక పెద్ద కథ ఉంది. మీరు నిదానంగా వింటానంటే..."

"పెద్ద కథా...? అబ్బో... అయితే, అదేమిటో చెప్పు..." అన్నాడు ఆదిత్య నవ్వుతూ, వాతావరణాన్ని తేలిక చెయ్యాలనే ఉద్దేశంతో. అతను ఆ వేళ ఎందుకో లీవ్ పెట్టాడు.

"ముందుగా మీరు నన్ను క్షమించాలి..." తల దించుకుని అన్నది ఉష.

"నిన్ను క్షమించాలా...! నువ్వేం తప్పు చేశావని...?

## చెట్టు

**నా** పేరు 'చెట్టు' / వివరిస్తాను నా గుట్టు
భూమికి నేను తోబుట్టు /రక్షిస్తా అందరినీ ఒట్టు
నన్ను కాపాడుట చేపట్టు
ప్రాణవాయువు నీ గుండె తట్టు
ఆరోగ్యం మీ తలుపు తట్టు
మీ జీవితంలో పెంచండి ఓ చెట్టు
భావితరాలకు మంచి మెట్టు

**-అమ్మిరాజు**

అయినా, నువ్వు తప్పు చెయ్యడమా...? నేను నమ్మను. ఇదిగో ఈ కుర్చీలో కూర్చుని చెప్పు. పెద్ద కథ అంటు న్నావుగా..." నవ్వుతూ అన్నాడు ఆదిత్య మరో సిగరెట్ వెలిగించుకోబోతూ.

"ముందు మీరా సిగరెట్ అవతల పారెయ్యండి. లేకపోతే నేను చెప్పను..." మూతి బిగించింది ఉష.

"సరే సరే... పారేస్తున్నాలే చెప్పు... నా అవసరం కదా మరి..." సిగరెట్‌ను భద్రంగా దాచుకున్నాడు ఆదిత్య.

"ఇది సుస్మిత పుట్టిన నాటి విషయం. మీరు ఆ రోజు వారిజ గారిని హడావుడిగా శారదా నర్సింగ్ హోమ్‌కు తీసుకువచ్చారు.. గుర్తుందా...?" అడిగింది ఉష.

"అవును. డెలివరీకి ఇంకా నెల రోజులు టైము ఉందనగా, ఆ రోజు సడన్‌గా వారిజకు పెయిన్స్ మొదలయ్యాయి. రాజకీయ నాయకుడి హత్యతో ఊరంతా అల్లకల్లోలంగా ఉంది. టాక్సీ కూడా దొరక లేదు. నేను మా ఫ్రెండునడిగి కారు తీసుకుని, వారి జను ఆస్పత్రికి తీసుకువచ్చాను.."

అవును. మీ కంగారులో మీరు ఫోన్ కూడా చెయ్యి కుండా ఆమెను తీసుకువచ్చేశారు. ఆ సంగతి తెలియని డాక్టరు శారదగారు ఏదో అర్జంట్ పనిమీద బయటకు వెళ్ళారు. ఆమె నాకు మేనత్త. మీరు వచ్చినప్పుడు నేను అక్కడే ఉన్నాను.

"అప్పుడు నువ్వు అక్కడ ఉన్నావా...! నేను గమనించలేదు. అయినా, అక్కడికి అప్పుడెందుకు వచ్చావు...?"

"ఆ డాక్టరు నాకు మేనత్త అని చెప్పాను గదా... నా హౌస్ సర్జన్సీ అయిపోయింది. ఖాళీగా ఉన్నాను గదా అని వచ్చాను."

"హౌస్ సర్జన్సీ అయిపోవడమా...? ఏమిటి ఈ వేళ ఏమన్నా అంతర్జాతీయ జోకులదినమా...? వరుసపెట్టి జోకులు పేలుస్తున్నావు..." పెద్దగా నవ్వాడు ఆదిత్య.

"ఈ వేళ జోకుల దినమూ కాదు. ఇది జోకు అంతకన్నా కాదు. మీకు అబద్ధం చెప్పి, మీ ఇంట్లో ఉద్యోగానికి వచ్చాను. అందుకే ముందుగా క్షమించ మన్నాను..." తల వంచుకుంది ఉష.

"ఏమిటి... నువ్వు నిజంగా డాక్టరు కోర్సు చదివావా...? నిజంగానా...?" నమ్మలేనట్లు అడిగాడు ఆదిత్య.

"ముమ్మాటికీ నిజం. ఆ రోజు జరిగింది చెబుతాను వినండి. మీరు రాగానే నేను అత్తయ్యకు ఫోన్ చేశాను అర్జంట్‌గా రమ్మని. ఆమె వెంటనే కారులో బయలు దేరారు. కానీ, మధ్య దోవలో ఒకచోట ఇరుక్కు పోయారు. హత్యచేయబడ్డ రాజకీయ నాయకుని అనుయాయులు, రౌడీమూకలూ కలిసి షాపులు లూటీ చెయ్యడం, బస్సులను తగులబెట్టడం లాంటి నానా గందరగోళం చేశారు గదా... దానికితోడు మత ఘర్షణలు కూడా తోడయి, మరో ఇద్దరు చంపబడ్డారు. ఊరిలో ఎక్కడ చూసినా ఆందోళన..."

అవును. మేము ఆస్పత్రికి రావడం కూడా చాలా కష్టమయింది స్కూళ్ళు, కాలేజీలు, దుకాణాలు, బ్యాంకులు అన్నీ మూసేశారు. ఊళ్ళో జనం ఏ క్షణాన ఏ ఘోర వార్త వినవలసి వస్తుందోనని భయపడుతూ గుండెలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. బయటకు వెళ్ళిన తమవారు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చే దాకా..." అన్నాడు ఆదిత్య.

"ఈ గందరగోళంలో ఎక్కడో చిక్కుకుపోయిన అత్తయ్య ఆస్పత్రికి చేరుకోలేని పరిస్థితి. చివరకు ఎలాగో ఒక తెలిసిన సి.ఐ. గారి సాయంతో, నానా అవస్థా పడి ఆమె రావడానికి రెండు గంటలు పట్టింది. ఈలోగా వారిజ గారి పరిస్థితి విషమించింది. ఆస్ప త్రిలో నాకు తోడు మరో కొత్త సిస్టర్ మాత్రమే ఉన్నది. అక్కడికీ అత్తయ్య సెల్ ఫోనులో సూచనలిస్తున్న విధంగానే నేను డెలివరీ చేశాను. సమయానికి అత్యవ సరమైన మందు కూడా దొరకలేదు. డెలివరీ అవగానే ఓవర్ బ్లీడింగ్‌తో వారిజగారు చనిపోయారు. అత్తయ్య ఆస్పత్రికి చేరేలోపే ఆమె ప్రాణం పోయింది. సమయా నికి అత్తయ్య ఉండి ఆపరేషనే చేసినట్లయితే, వారిజ గారు మీకు దక్కి ఉండేవారు."

"నా వల్లే... నా చేతగాని తనం వల్లే వారిజగారు చనిపోయారేమోననే అపరాధ భావనతో నేను మూడు నెలలు మంచం పట్టాను. ఎన్ని విధాలుగానో, ఎంత గానో చెప్పి, అత్తయ్యా, అమ్మా, నాన్నా నన్ను మామూలు మనిషిని చేశారు."

"ఇంత విషయం జరిగిందా... నిజానికి నీ తప్పు లేకపోయినా, నువ్వు నీ తప్పుకి ప్రాయశ్చిత్తం అన్నట్లు పిల్లలకి గవర్నెస్‌గా మా ఇంటికి వచ్చి, ఇప్పుడు నా జీవితానికి గవర్నర్‌వి అవుదామనకుంటున్నావన్న మాట..." ఆర్తిగా ఆమె చేతులు అందుకున్నాడు ఆదిత్య. ■